


నీట్‌లో యువరత్న తేజకు అత్యుత్తమ ర్యాంకు



ప్రజాశక్తి - మండవల్లి

నీట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన బోయిన యువరత్న తేజను తల్లిదండ్రులతోపాటు పలువురు అభినందించారు. బుధవారం విడుదల చేసిన ఫలితాలలో యువరత్న తేజ అత్యుత్తమ ర్యాంకు సాధించడంతో స్నేహితులు బంధువులు హర్షం వ్యక్తం చేశారు. మండవల్లికి చెందిన బోయిన శ్రీ రామాంజనేయులు (బిఎస్ఎన్ఎల్) కుమారుడు గత నెల ఏడో తేదీన నీట్ రాశాడు. యువరత్న తేజ 98.6274868 పర్సంటైల్‌తోపాటు జాతీయస్థాయిలో 27,450వ ర్యాంకు సాధించాడు. జనరల్ ఇడబ్ల్యుఎస్ కేటగిరిలో 3,520 ర్యాంకును కైవసం చేసుకున్నాడు. ఇదే పట్టుదలతో ఎంబిబిఎస్ పూర్తి చేసి డాక్టర్‌గా ప్రజలకు విలువైన వైద్య సేవలను అందించాలని పలువురు ఆకాంక్షించారు.

రేషన్ బియ్యం పక్కదారి..!



మాఫియా తరహాలో బియ్యం వ్యాపారం
రేషన్ వాహనాల్లోనే కొనుగోలు ప్రక్రియ
బియ్యం ఇచ్చేది వారే.. కొనేది వారే అన్నట్లు పరిస్థితి
కిలో రూ.పదికి కొనుగోలు చేసి అదనంగా అమ్మకాలు
అధికారుల దాడుల్లో పట్టుబడేది నామమాత్రమే
బియ్యం నాణ్యత లేకపోవడమే విక్రయాలకు ప్రధాన కారణం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం రెండు జిల్లాల్లో మూడు పువ్వులు.. ఆరు కాయలు అన్నట్లు సాగుతోంది. పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ దాడుల్లో పట్టుబడుతున్న రేషన్ అక్రమ బియ్యం నామమాత్రమే. మాఫియా తరహాలో రేషన్ బియ్యం దందా సాగుతుందని చెప్పొచ్చు. దీని వెనుక బడాబాబులు సైతం ఉండటంతో అధికార యంత్రాంగం సైతం పెద్దగా పట్టించుకోవడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. రేషన్ బియ్యం కొనుగోలు, విక్రయాలన్నీ రేషన్ పంపిణీ చేసే వాహనాల ద్వారానే జరుగుతుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. రెండు జిల్లాల్లో దాదాపు 11.73 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో 6.39 లక్షల వరకూ ఉండగా, పశ్చిమలో 5.33 లక్షల కార్డులు ఉన్నాయి. రేషన్ కార్డులో ఉన్న ప్రతి వ్యక్తికీ ఐదు కిలోల చొప్పున బియ్యం ప్రభుత్వం అందిస్తోంది. రెండు జిల్లాల్లో 751 వరకూ వాహనాలు రేషన్ సరుకులను అందిస్తున్నాయి. ప్రతినెలా రెండు జిల్లాల్లోనూ మొత్తంగా 16,900 టన్నుల బియ్యం రేషన్ వాహనాల ద్వారా లబ్ధిదారులకు అందుతోంది. తాము అధికారంలోకి వస్తే రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం ఇస్తామంటూ వైసిపి హామీ ఇచ్చింది. అయితే అమలు మాత్రం లేకుండా పోయింది. రేషన్ వాహనాల ద్వారా ఇస్తున్న బియ్యం నాణ్యత లేకపోవడంతో చిమిడిపోయి ముద్దవుతున్న పరిస్థితి ఉంది. దీంతో రేషన్ బియ్యం అన్నం తింటే కడుపునొప్పి వంటి సమస్యలు వస్తున్నట్లు లబ్ధిదారులు చెబుతున్నారు. దీంతో రేషన్ బియ్యం విక్రయించి ఆ సొమ్ముకు మరికొంత సొమ్ము అదనంగా వేసి నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేసుకుని తింటున్న పరిస్థితి ఉంది.

యథేచ్ఛగా రేషన్ బియ్యం దందా..

జిల్లాలో రేషన్ బియ్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు వ్యాపారమంతా రేషన్ వాహనాల ద్వారానే సాగుతున్న పరిస్థితి నెలకొంది. లబ్ధిదారులు ఎవరైనా బియ్యం వద్దనుకుంటే రేషన్ వాహనాల వద్దే కొనుగోలు సాగిపోతుంది. బియ్యం ఇచ్చినట్లు వేలిముద్ర వేయించుకుని వెంటనే కిలోకు రూ.పది చొప్పున సొమ్ము ఇచ్చేస్తున్నారు. వాలంటీర్ల నుంచి అందరికీ తెలిసే బియ్యం కొనుగోలు వ్యవహారం సాగుతోంది. ప్రతిరోజూ ఎంత బియ్యం ఇచ్చారు.. ఇంకా ఎంత బియ్యం వాహనాల్లో నిల్వ ఉందో తనిఖీలు చేస్తే బయటపడే అవకాశం ఉంటుంది. అయితే అది ఎక్కడా జరగడం లేదు. దీంతో బియ్యం కొనుగోలు అంతా బహిరంగంగానే సాగిపోతుంది. రేషన్ బియ్యం అక్రమ రవాణాపై అధికారులు చేస్తున్న దాడులు నామమాత్రమేనని చెప్పొచ్చు. లబ్ధిదారుల నుంచి కిలో రూ.పది, రూ.12కు రేషన్ బియ్యం కొనుగోలు చేసి, కిలో రూ.18 నుంచి రూ.20కు విక్రయిస్తూ భారీగా లాభాలు గడిస్తున్న పరిస్థితి నెలకొంది. రేషన్ బియ్యం మాఫియా వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకుంటే తప్ప దీనికి అడ్డుకట్ట పడదు. రేషన్ బియ్యం కొనుగోలులో రేషన్ పంపిణీ వాహనాల పాత్ర ఉండటం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది.

నాణ్యత లేకపోవడమే పక్కదారికి ప్రధాన కారణం

ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా అందించే బియ్యం నాణ్యత లేకపోవడంతో తినేందుకు అనుకూలంగా ఉండటం లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. కొంతమంది వేరే గత్యంతరం లేక రేషన్ బియ్యంతోనే కడుపు నింపుకుంటుండగా అనారోగ్య సమస్యలతో బాధపడే కొంతమంది లబ్ధిదారులు రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నారు. చాలా మంది వృద్ధులు బిపి, సుగర్ వంటి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఇలాంటి వారంతా రేషన్ బియ్యం తింటే ఇబ్బందికరంగా ఉంటుందని చెబుతున్నారు. ప్రభుత్వం నాణ్యమైన బియ్యం ఇస్తే ఎందుకు అమ్ముకుంటామని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారు. రేషన్ బియ్యం లబ్ధిదారులు తినడం లేదంటూ ప్రచారం చేసి నగదు బదిలీ వంటి ఆలోచనలను తెరపైకి తెస్తున్న పరిస్థితి సృష్టిస్తున్నారు. ప్రభుత్వం నాణ్యమైన సన్న బియ్యం అందించి రేషన్ బియ్యం దందాకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. అంతేకాకుండా రేషన్ బియ్యం దందాకు పాల్పడుతున్న సూత్రధారులపై కఠిన చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న టాటాఏస్





మృతి చెందిన చిన్నారులు

తల్లడిల్లిన తిరుమలదేవిపేట

భద్రాచలం రాముడి గుడికి వెళ్లొస్తుండగా ఘోర ప్రమాదం
నలుగురు మృతి, పలువురికి తీవ్ర గాయాలు
మృతుల్లో తోడళ్లుళ్లు, అన్నదమ్ములు

ప్రజాశక్తి - టి.నర్సాపురం

వారంతా బంధువులే. మూడు కుటుంబాలకు చెందిన 12 మంది భద్రాద్రి రాముడికి మొక్కులు చెల్లించుకోవడానికి బుధవారం తెల్లవారుజామున సంతోషంగా బయల్దేరి వెళ్లారు. దర్శనం అనంతరం టాటాఏస్‌లో తిరుగు ప్రయాణంలో చోటుచేసుకున్న ప్రమాదం ఆ కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. వారు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి సుమారు 20 అడుగుల లోతు వాగులో పడిపోయింది. అప్పటివరకూ ఆనందంగా సాగిన ప్రయాణం కుదుపునకు లోనైంది. ఈ ప్రమాదంలో ఇద్దరు తోడళ్లుళ్లు, చిన్నారులైన ఇద్దరు అన్నదమ్ములు విగతజీవులయ్యారు. మరికొందరు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. ఈ ఘటన మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో బుధవారం పెను విషాదాన్ని నింపింది.

తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన జట్ల దుర్గారావు తన భార్య నిర్మలకుమారి, ఇద్దరు కుమారులు, తోడల్లుడు పశ్చిపాల చిన్న శ్రీను, భార్య కమల కుమారి, ఇద్దరు పిల్లలు, బావమరిది దాసరి నరసింహారావు కుటుంబీకులు మొత్తం 12 మంది భద్రాద్రి రాముడి దర్శనానికి బయల్దేరారు. బావమరిది నరసింహారావుకు చెందిన టాటాఏస్ వాహనంపై వీరు ప్రయాణం సాగించి దర్శనం చేసుకున్నారు. తిరిగి అదే వాహనంపై బుధవారం మధ్యాహ్నం బయల్దేరారు. తెలంగాణా-ఆంధ్రా సరిహద్దులోని బూర్గంపాడు వద్ద కిన్నెరసాని వాగు వంతెనపై నుండి టాటా ఏస్ వాహనం ప్రమాదవశాత్తు అదుపు తప్పి వాగులో పడిపోయింది. దీంతో వ్యానులో ఉన్న వారికి తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న తెలంగాణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన వారిని బూర్గంపాడు ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే ఇద్దరు తోడల్లుళ్లు జట్ల దుర్గారావు (35), పశ్చిపాల చిన్న శ్రీను (34) అప్పటికే మృతి చెందగా దుర్గారావు కుమారుడు సందీప్ (10), ప్రదీప్ (8) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. చిన్నశ్రీను కుమార్తె రవితేజ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించినట్లు సమాచారం. మిగిలిన వారు గాయాలతో భద్రాచలం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని బంధువులు తెలిపారు.

రెండు కుటుంబాల్లో తీరని విషాదం

తిరుమలదేవిపేట గ్రామానికి చెందిన జట్ల దుర్గారావు దాసరి వెంకటసత్యనారాయణ, సుబ్బలక్ష్మి దంపతుల పెద్ద కుమార్తెను వివాహం చేసుకున్నారు వీరికి ఇద్దరు కుమారులు. అదే గ్రామానికి చెందిన పశ్చిపాల చిన్న శ్రీను చిన్న కుమార్తె కమల కుమారిని వివాహం చేసుకోగా వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అయితే తెలంగాణ రాష్ట్రం బూర్గంపాడువద్ద జరిగిన ప్రమాదంలో దుర్గారావు, అతని ఇద్దరు కుమారుడు మృతి చెందగా భార్య నిర్మల ప్రమాదం నుండి బయటపడి ఒంటరిగా మిగిలిపోయింది. ఆమెను ఓదార్చడం ఎవరితరం కాని పరిస్థితి నెలకొంది. చిన్న శ్రీను మృతి చెందగా ఆయన కుమార్తె ప్రాణాపాయ స్థితిలో ఉంది. ఇద్దరు అల్లుళ్లను, ఇద్దరు మనవళ్లను కోల్పోయిన మృతుల అత్త మామ రోదిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది.

తల్లడిల్లిన తిరుమలదేవిపేట

గ్రామానికి చెందిన నలుగురు ప్రమాదంలో మృతి చెందడంతో తీవ్ర విషాదఛాయలు అలముకున్నాయి. వ్యవసాయ కుటుంబానికి చెందిన వీరు ఎప్పుడూ నవ్వుతూ ఉండేవారని గుర్తు చేసుకుని అంతా ఆవేదన వ్యక్తం చేశారు.

నిబంధనల మేరకు జర్నలిస్టులకు అక్రిడిటేషన్లు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలోని జర్నలిస్టులకు నిబంధనల మేరకు అక్రిడిటేషన్ల సౌకర్యం మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో బుధవారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధి వంటివారని, సమాజంలో జరుగుతున్న అవినీతిని ప్రభుత్వ యంత్రాంగానికి తెలియజేయడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను కూడా ప్రజల వద్దకు తీసుకెళ్లాలని సూచించారు. జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెం.38 ద్వారా నిబంధనలు జారీ చేసిందని, ఆ నిబంధనలు అనుసరించి జర్నలిస్టులకు అక్రిడిటేషన్ సౌకర్యం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు గృహనిర్మాణ సంస్థ పీడీ నరసింహారావు, ఆర్‌టిసి రీజినల్ మేనేజర్ ఎన్‌విఆర్.వరప్రసాద్, పిఆర్ఒ నరసింహం, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాస్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ టి.ఆంద్రులూయిస్, రైల్వే అధికారి కె.కిరణ్, కమిటీ సభ్యులైన మీడియా ప్రతినిధులు కె.కిషోర్, బాలశౌరి, బి.రవికుమార్, కె.ఉమామహేశ్వరరావు, షేక్ రియాజ్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.భవాని తదితరులు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థుల రక్తదానం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆర్‌జియుకెటి నూజివీడు ట్రిపుల్ ఐటి విద్యార్థులు స్థానిక ఏరియా ఆసుపత్రి సహకారంతో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మొత్తం 54 మంది విద్యార్థులు రక్తదానంలో పాల్గొన్నట్లు ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేంద్రసింగ్ తెలిపారు. రక్తదానం చేయడానికి ముందుకొచ్చిన విద్యార్థులకు, ట్రిపుల్ ఐటి నూజివీడు క్యాంపస్ యాజమాన్యానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రిపుల్ ఐటి ఎఒ పి.ప్రదీప్, డాక్టర్ ఎ.హరికృష్ణ, డాక్టర్ దుర్గాభవాని, నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


వైసిపి హయాంలో దళితులకు రక్షణ కరువు : టిడిపి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వైసిపి ప్రభుత్వంలో దళితులకు రక్షణ కరువైందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి దాసరి ఆంజనేయులు, ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జాలా బాలాజీ విమర్శించారు. బుధవారం స్థానిక బడేటి చంటి క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆంజనేయులు, బాలాజీ మాట్లాడుతూ సిఎం జగన్ ప్రభుత్వ వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. తాను దళిత పక్షపాతి అని నిత్యం చెప్పుకునే ఆయన అధికారం చేపట్టిన తర్వాత దళితులపైనే దాడులు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నా జగన్‌లో చలనం లేదన్నారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా చించినాడలో అనాదిగా దళితులు సాగుచేస్తున్న భూములను వైసిపి కబ్జాదారులు ఆక్రమించి దళితులకు ఉపాధి లేకుండా చేశారని, ఇదేమని ప్రశ్నించిన నాయకులపై పోలీసులు రాక్షసంగా వ్యవహరించారని విమర్శించారు. మంగళవారం రాత్రి దళిత మహిళ యడ్ల ఫ్రాన్సికపై కొందరు దుండగులు యాసిడ్ దాడి చేస్తే పోలీసు అధికారులు పరామర్శించారు తప్ప నిందితులపై చర్యలు తీసుకోలేదన్నారు. ఫ్రాన్సిక కుటుంబానికి న్యాయం చేసి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్‌సి సెల్ నగర ప్రధాన కార్యదర్శి చౌటపల్లి శ్రీను, టిడిపి 44, 18, 38 డివిజన్ ఇన్‌ఛార్జులు లక్కపోగు రవీంద్ర, పలివెల కిషోర్, గరికపూడి చంటి, దళిత నాయకులు బొడ్డు వెంకటరావు పాల్గొన్నారు.

పాడిరైతుల సంక్షేమమే కృష్ణా మిల్క్ యూనియన్ లక్ష్యం

ప్రజాశక్తి - ఆగిరిపల్లి



మాట్లాడుతున్న ఆంజనేయులు

కృష్ణా మిల్క్ యూనియన్ ద్వారా రూ.50కే అందిస్తున్న గ్రేడెడ్ సెమన్‌ను పాల ఉత్పత్తిదారులు సద్వినియోగం చేసుకుని మేలుజాతి దూడలను ఉత్పత్తి చేయాలని కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం మండల పరిధిలోని ఈదులగూడెం గ్రామ పాల ఉత్పత్తిదారుల అసోసియేషన్ ద్వారా 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ.1,93,240 బోనస్‌ను పాల ఉత్పత్తిదారులకు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ ద్వారా అందజేస్తున్న క్షీరబంధు, కళ్యాణమస్తు పథకాలను పాల ఉత్పత్తిదారులు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా డైరెక్టర్ పల్లగాని కొండలరావు, ఈదులగూడెం పాల ఉత్పత్తిదారుల అధక్షులు పెద్ది ప్రతాప్, మైలవరం క్లస్టర్ మేనేజర్ తుమ్మల యశ్వంత్, రూట్ సూపర్‌వైజర్, ఎం.అనిల్ కుమార్, వేతన కార్యదర్శి కె.కృష్ణబాబు, పాల ఉత్పత్తిదారులు పాల్గొన్నారు.

స్ఫూర్తిదాయకులు చేగువేరా

ప్రజాశక్తి - ఏలూరు



ఏలూరులో నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రపంచ విప్లవ వీరుడు చేగువేరా 95వ జయంతి సందర్భంగా సిపిఎం జిల్లా కార్యాలయంలో చేగువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన జరిగిన సభలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ప్రపంచ విప్లవకారుడు, క్యూబా విప్లవ నేత చేగువేరా వృత్తిరీత్యా డాక్టర్ అయినప్పటికీ క్యూబాలో ప్రజల దోపిడీకి వ్యతిరేకంగా తన మిత్రుడు ఫెడల్ కాస్ట్రోతో కలిసి పోరాడి విప్లవం సాధించిన నేత అని కొనియాడారు. ప్రపంచంలో దోపిడీకి గురవుతున్న ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారని, దానికి సోషలిస్టు సమాజం మార్గమని అన్నారు. చేగువేరా క్యూబాలో విప్లవం సాధించిన తర్వాత అక్కడితో తన పోరాటాన్ని ఆపకుండా పక్కనే ఉన్న బొలివియా దేశంలో కూడా ప్రజలను దోపిడీ నుండి విముక్తి చేసేందుకు తన పోరాటాన్ని కొనసాగించాడన్నారు. ప్రపంచంలో చేగువేరా అంటే యువతకు బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. మన దేశంలో, రాష్ట్రంలో కొన్ని బూర్జువా పార్టీలు చేగువేరా బొమ్మ పెట్టుకొని రాజకీయాలు చేస్తున్నాయన్నారు. అటువంటివారు చేగువేరా ఏ ఆశయాల కోసం పోరాడాడో ముందు తెలుసుకోవాలని హితవు పలికారు. చేగువేరా ఆశయాలు తెలియకుండా ఆయన ఫొటోలతో ప్రచారం చేసుకోవడం ఆత్మవంచనే అవుతుందన్నారు. చేగువేరా ఆశించిన సమ సమాజం మన భారత దేశంలో తీసుకురావడం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మన దేశంలోని లౌకిక రాజ్యాంగాన్ని మత రాజ్యాంగంగా మార్చాలని బిజెపి మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ మతోన్మాద, కార్పొరేట్ సంస్థ అనుకూల ప్రజావ్యతిరేక విధానాలను చేగువేరా పోరాట స్ఫూర్తితో తిప్పికొట్టాలని రవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.సాయిబాబు, పి.సూర్యారావు, జె.గోపి, ఎం.ఇస్సాక్, మీసాల సత్యనారాయణ, సింహాచలం, ఆర్.నరసింహమూర్తి, బి.త్రినాథ్, వై.సీతారాం పాల్గొన్నారు.

ఏలూరు: చేగువేరా తరతరాలు గుర్తుంచుకునే గొప్ప ఆదర్శ నాయకుడు అని ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు వి.సురేష్ అన్నారు. స్థానిక అన్నే భవనంలో చేగువేరా 95వ జయంతి సందర్భంగా సభ నిర్వహించారు. సభకు జి.సురేష్ ఆహ్వానం పలికారు. వి.సురేష్ అధ్యక్షత వహించారు. తొలుత చేగువేరా చిత్రపటానికి విజ్ఞాన కేంద్రం కమిటీ సభ్యులు పి.పరమేశ్వరరావు, విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. చేగువేరా జీవిత విశేషాల ఆడియో వినిపించారు. సభాధ్యక్షులు సురేష్, విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఏలూరు సన్‌రైజ్ లయన్స్ క్లబ్ తరపున విజ్ఞాన కేంద్రానికి ఇచ్చిన బ్లాక్ అండ్ వైట్ బోర్డును లయన్స్ క్లబ్ అధ్యక్షులు వి.సురేష్ కమిటీ సభ్యులకు అందించారు. డాక్టర్ రావిగోపాలకృష్ణయ్య అందించిన సాహిత్యం, పి.పరమేశ్వరరావు అందించిన సాహిత్యం బుక్‌బ్యాంక్‌కు స్వీకరించారు. సభలో కె.శ్రీనివాస్, ఎం.లక్ష్మి, సిహెచ్.జగదీష్, దుర్గా ప్రసాద్, రామ్ కుమార్, సాయి మాట్లాడారు.

జంగారెడ్డిగూడెం : ప్రపంచ విప్లవ యోధుడు చే గువేరా స్ఫూర్తితో ఆయన ఆశయసాధనకు యువత ముందుకు సాగాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ అన్నారు. బుధవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేగువేరా జయంతిని మైసన్నగూడెంలో ఘనంగా నిర్వహించారు. తొలుత చే గువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సూర్యకిరణ్ మాట్లాడుతూ ప్రపంచ మానవాళి విముక్తికి భౌగోళిక సరిహద్దులతో సంబంధం లేకుండా అమెరికన్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా ఆఖరి క్షణం వరకూ పోరాడిన ధీరుడు చే గువేరా అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పి వెంకటసుబ్బారావు, పోతురాజు, నాగేంద్ర, పి.దుర్గారావు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉపాధి హామీని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - కలిదిండి

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకునేందుకు కూలీలు వ్యవసాయ కార్మిక సంఘంలో సభ్యులుగా చేరి పోరాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు అన్నారు. మండలంలోని భాస్కరరావు పేట, కలిదిండి గ్రామాల్లో ఉపాధి పనులు జరిగే ప్రదేశాల్లో పర్యటించారు. కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాల ద్వారానే ఉపాధి హామీ చట్టం వచ్చిందన్నారు. నేడు మోడీ ప్రభుత్వం కూలీలకు వ్యతిరేకంగా మార్పులు చేస్తోందన్నారు. ఈ చట్టానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ కూలీలు తమంతట తామే పని మానేసేలా చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు వీరవల్లి భాస్కరరావు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యకర్తలు దోనె ప్రసన్న రాణి, కోకా సునీత, చెల్లి కాంతమ్మ, హారతి, తులిమిల్లి నాగమణి పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి జగన్ కృషి : జెడ్‌పి చైర్‌పర్సన్

ఏలూరు టౌన్: ప్రభుత్వ రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులకు సిఎం జగన్ ఎన్నడూ లేనివిధంగా వరాలు కురిపించారని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ ప్రసాదరావు అన్నారు. పారామెడికల్‌కు చెందిన కాంట్రాక్టు ఉద్యోగులు బుధవారం చైర్‌పర్సన్‌ను క్యాంప్ కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు, శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పదివేల మంది కాంటాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించిన ఘనత సిఎం జగన్‌కు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షులు గంటా ప్రసాదరావు, పారామెడికల్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ తరపున ఆరోగ్య కార్యకర్తలు రామకృష్ణ, మురళీకృష్ణ, వేణు, బేబీ, లక్ష్మీకుమారి, ప్రేమరాణి పాల్గొన్నారు.

20 క్రీడా విభాగాల్లో 50 క్యాంపులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం బుధవారం ఏలూరులోని అల్లూరి సీతారామరాజు స్టేడియంలో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో వేసవి శిక్షణా శిబిరాల్లో 20 క్రీడా విభాగాల్లో 50 క్యాంపులు నిర్వహించామన్నారు. అందుకు అవసరమైన క్రీడా సామగ్రిని క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ వినాయక్ ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుల అసోసియేషన్ సెక్రటరి రమేష్, బాస్కెట్‌బాల్ ఉమ్మడి జిల్లా అసోసియేషన్ సెక్రటరీ గవ్వా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నారాయణపురం డిగ్రీ కాలేజీలో కొత్త కోర్సులు

ఉంగుటూరు: నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నూతన విద్యా విధానంలో భాగంగా సింగిల్ మేజర్ సింగిల్ మైనర్ సబ్జెక్టుల్లో డిగ్రీ కోర్సులను ప్రారంభిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు తెలిపారు. బుధవారం కళాశాల ప్రణాళిక, అభివృద్ధి సంఘ సభ్యులు ఈపూరి సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు, సాగిరాజు జానకి రామరాజు, ఆదిరెడ్డి సత్యనారాయణ, సీతారామాంజనేయరాజు, బుల్లబ్బాయి తదితర సభ్యులుతో అడ్మిషన్లకు సంబంధించిన కరపత్రాన్ని కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థి, సంఘ అధ్యక్షులు ఈపూరి సత్యనారాయణ మాట్లాడుతూ బిఎస్‌సి కంప్యూటర్స్ సింగల్ మేజర్‌గా బిఎస్‌సి జువాలజీ సింగిల్ మేజర్, బికాం జనరల్‌తో పాటు మైనర్ సబ్జెక్ట్‌గా కంప్యూటర్ అప్లికేషన్, బిఎలో ఎకనామిక్స్ మేజర్ సబ్జెక్టుతో పాటు కంప్యూటర్ కోర్సు ఈ సంవత్సరం నుంచి డిగ్రీ కోర్సులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిడదవోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఐక్యూ ఎసి కో ఆర్డినేట్ డాక్టర్ పివి.లక్ష్మణరావు, కళాశాల కో ఆర్డినేట్ డాక్టర్ కొండా రవి, రెడ్డియ్య, అధ్యాపకులు పాల్గొన్నారు

పెరుగులంక పేదలపై లాఠీఛార్జికి నిరసనగా ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



ధర్నా చేస్తున్న నాయకులు

పశ్చిమగోదావరి జిల్లా చించినాడలో పెరుగులంక భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలపై పోరాడుతున్న పేదలపై పోలీసుల లాఠీఛార్జి, అక్రమ అరెస్టులను ఖండిస్తూ సిపిఎం ఆధ్వర్యాన బుధవారం ఏలూరులో నిరసన ధర్నా చేపట్టారు. పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన ఈ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ చించినాడ పెరుగులంక భూముల్లో 50 సంవత్సరాల నుండి దళితులు, బలహీన వర్గాలకు చెందిన పేదలు సాగు చేసుకుంటున్నారని, పేదలు సాగు చేస్తున్న అసైన్డ్ భూముల్లో వైసిపి ప్రజాప్రతినిధులు తమ బినామీల పేరుతో అక్రమ మట్టి తవ్వకాలు తవ్వుతున్నారని విమర్శించారు. వాస్తవానికి గోదావరిని ఆనుకుని ఉన్న భూముల్లో మట్టి తవ్వకాలు నిషేధమని, అయినప్పటికీ నిబంధనలు ఉల్లంఘిస్తూ అధికార పార్టీ పెద్దలు అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఆ మట్టి తవ్వకాలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న సిపిఎం నెల రోజులుగా చించినాడ పేదల అసైన్డ్ భూముల కోసం వివిధ రూపాల్లో అక్కడ పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. చించినాడ పేదలకు మద్దతు తెలపడానికి వెళ్లిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఆ జిల్లా కార్యదర్శి బి.బలరాం, పాలకొల్లు ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు, ఇతర ప్రజాసంఘాల నాయకులపై పోలీసులు లాఠీఛార్జి చేసి అక్రమ అరెస్టులు చేశారన్నారు. పేదల భూములు కాపాడాల్సిన రాష్ట్ర ప్రభుత్వం పెద్దలకు అనుకూలంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. దీని వెనక నరసాపురం ఎంఎల్‌ఎ ప్రసాద్‌రాజు, స్థానిక ఎంఎల్‌సి కౌరు శ్రీనివాసు హస్తం ఉందని ఆరోపించారు. ఏలూరు దగ్గర దోసపాడు గ్రామంలో అసైన్డ్ భూముల విషయంలో కూడా వైసిపి ప్రభుత్వం తీరు అలానే ఉందని విమర్శించారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం పేదల అసైన్డ్ భూములు ఆక్రమిస్తున్న ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చించినాడ అసైన్డ్ భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పేదలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నేతలు కె.శ్రీనివాస్, వి.సాయిబాబు, ఎం.శ్రీనివాసరావు, ఇస్సాక్, కట్టా సత్యనారాయణ, జి.గోపీ, పి.రవికుమార్, సత్యనారాయణ, నరసింహమూర్తి, మీసాల సత్యనారాయణ, వై.సీతారాం, సాంబమూర్తి పాల్గొన్నారు.

మైదానప్రాంత టీచర్ల బదిలీకి ఖండన

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఏజెన్సీ మైదాన ప్రాంత టీచర్ల బదిలీలను ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కమిటీ ఖండించింది. బుధవారం మండల కేంద్రంలోని ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, ధర్ముల రమేష్ ఏజెన్సీ పరిధిలోని మైదాన ప్రాంత టీచర్ల బదిలీలు ఆపాలని కోరుతూ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఏజెన్సీ ప్రాంతంలో 400 మంది రెగ్యులర్ టీచర్లను బదిలీ చేశారని, జిఒ నెంబరు మూడును రద్దు చేసిన ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ దాఖలు చేయాలని డిమాండ్ చేశారు. షెడ్యూల్డ్ ఏరియాలో జిఒ-3 ప్రకారం ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియను కొనసాగించాలన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

జగన్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యం : గన్ని

ప్రజాశక్తి - భీమడోలు

జగన్ పాలనలో విద్యావ్యవస్థ నిర్వీర్యమైందని టిడిపి ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆరోపించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం టిఎన్ఎస్ఎఫ్ జిల్లాస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వీరాంజనేయులు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'టిఎన్ఎస్ఎఫ్ రూపొందించిన ఫీజు ఎక్కడ' గోడ పత్రికను గన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మఒడి పథకం అందరికీ కాక కొంతమందికే పరిమితం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భోగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షులు నరేష్ చంద్రబాబు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కమ్ము వర్దన్, జిల్లా అధ్యక్షులు పి.పవన్ పాల్గొన్నారు.




నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న అధికారులు

నాడు-నేడు పనులు చురుగ్గా చేపట్టాలి

ప్రజాశక్తి - భీమడోలు

పోలసానిపల్లి ప్రాథమిక పాఠశాల-1లో కొనసాగుతున్న నాడు-నేడు పనులు వేగవంతం చేయాలని ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి కోరారు. ఆమె బుధవారం పోలసానిపల్లిలో పర్యటించారు. తొలుత బైపాస్ రోడ్డు సమీపంలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలతో మాట్లాడారు. అక్కడ నుంచి గ్రామ సచివాలయ సందర్శనకు వెళ్లారు. విభాగాల వారీగా సిబ్బంది పనితీరును పరిశీలించి తగు సూచనలు చేశారు. ఆ తర్వాత పాఠశాల ఆవరణలోని అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆ తరువాత పాఠశాలను సందర్శించారు. అక్కడ కొనసాగుతున్న విద్యాబోధన, విద్యార్థులకు ప్రభుత్వపరంగా అందజేస్తున్న వివిధ అంశాల గురించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.తులసి శ్రీనివాస్ ఆమెకు వివరించారు. ఆ తరువాత మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఆహార పదార్థాలు రుచి చూసి సంతృప్తి వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జిజె.రవికాంత్, గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.



మానవత స్వచ్ఛంద సంస్థ నూతన కార్యవర్గం ఇదే..

'మానవత' భీమడోలు అధ్యక్షులుగా సుగుణాకర్


ప్రజాశక్తి - భీమడోలు

మానవత స్వచ్ఛంద సంస్థ భీమడోలు శాఖ నూతన అధ్యక్షులుగా పూళ్ల గ్రామానికి చెందిన వట్టి సుగుణాకర్ ఎన్నికయ్యారని శాఖ ఛైర్మన్ గుళ్ల రాజు తెలిపారు. పూళ్లలో బుధవారం శాఖ అధ్యక్షులు పద్మ వెంకటేశ్వరరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శాంతిరాజు జిల్లా విభాగం అధ్యక్షులు అప్పన్న రాంబాబు పాల్గొన్నారు. 2023- 24 ఆర్థిక సంవత్సరానికి గాను శాఖ నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఏకగ్రీవంగా జరిగిన ఈ ఎన్నికలో అధ్యక్షునితోపాటు ఉపాధ్యక్షులుగా గుడివాడ సీతారామాంజనేయులు, కార్యదర్శిగా అడబాల శ్రీనివాసరావు(బాబి), సంయుక్త కార్యదర్శిగా అల్లాడ ప్రసాదరావు, కోశాధికారిగా గుళ్ల అప్పారావు వివిధ విభాగాల ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా పుప్పల గోపి, డిపి చిన్నారావు, బి.గణేష్కుమార్, ఎం.రమేష్ ఎన్నికయ్యారని శాఖ ఛైర్మన్ తెలిపారు. నూతన కార్యవర్గాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ జిల్లా అధ్యక్షులు రామిశెట్టి గంగాధరరావు, జిల్లాకార్యదర్శి సభ్యులు ఎన్వీ.వెంకటేశ్వరరావు, డి.ప్రభాకర్, కె.సూర్యనారాయణతో పాటు స్థానిక ప్రముఖులు పూళ్ల సొసైటీ ప్రస్తుత, మాజీ అధ్యక్షులు కందులపాటి శ్రీనివాసరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హెడ్కానిస్టేబుల్ బాలాజీ మృతి తీరని లోటు

ప్రజాశక్తి - టి.నరసాపురం

హెడ్ కానిస్టేబుల్ బాలాజీ మృతి పోలీసు శాఖకు తీరని లోటని తహశీల్దార్ జెవి.సుబ్బారావు అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన బాలాజీ సంతాప సభను ఎస్ఐ సతీష్కుమార్, పోలీస్ సిబ్బంది బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తహశీల్దార్ మాట్లాడుతూ టి.నరసాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో బాలాజీ విశేషమైన సేవలందించారన్నారు. అందరితో స్నేహంగా ఉంటూ ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వర్తించారని నివాళులర్పించారు. అంకితభావంతో పని చేస్తూ అందరి మన్ననలు పొందారని కొనియాడారు. ఆయన అకాల మృతి బాధాకరమన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పిపీ నాయకులు దేవరపల్లి ముత్యాలు, ఎన్ఎంపిపి.శ్రీరామ్, బండి సుబ్బారావు, దాకారపు సూరిబాబు, సాధనాల నరసింహారావు, దేవరపల్లి సీతారాం ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థితో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ముసునూరు హైస్కూల్లో ఇంటర్ విద్య

ముసునూరు: బాలికలు పాఠశాల విద్యతోనే ఆగిపోకూడదని, వారి ఉన్నత చదువుల కోసమే ముసునూరు హైస్కూల్లో ఇంటర్మీడియట్ విద్యను ప్రవేశపెట్టినట్లు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎ.సునీల అన్నారు. బుధవారం ముసునూరు, చింతలవల్లి, గోగులంపాడు గ్రామాల్లో పదో తరగతి పూర్తయిన బాలికలను కలిసి ఇంటర్లో చేరేవిధంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, చిట్టిబాబు, శివనాగమల్లేశ్వరి, జాన్సీ, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ దాడులు

టి.నరసాపురం: మండలంలో ఎరువులు, విత్తన దుకాణాలపై విజిలెన్స్ అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. ఈనెల 12న మక్కినవారిగూడెంలో మహంకాళి పుల్లారావుకు చెందిన దుకాణంలో అనుమతులు లేని ధాన్యం విత్తనాలు 930 కేజీలను సీజ్ చేసిన అధికారులు యుజె.విల్సన్ బృందం విచారణలో భాగంగా బుధవారం బొర్రంపాలెంలో శ్రీసాయి లక్ష్మీదుర్గ అయ్యప్ప వెంకటరమణ మెన్యూర్ డిపో, ఎరువుల, విత్తన దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో లైసెన్సు లేని వ్యక్తి పుల్లారావుకు డెల్టా సీడ్స్ ధాన్యం విత్తనాలు 26 బస్తాలు, పూళ్ల విశాల సహకార సంఘానికి చెందిన ఐదు ధాన్యం విత్తన బస్తాలు ఐదుగురు రైతుల పేరున బిల్లులు రాసి విక్రయించినట్లు గుర్తించామని వారు తెలిపారు. షాపులో ఎరువులు, విత్తనాల నిల్వలు స్టాకు రిజిస్టర్లు పరిశీలించారు. వరి దాన్యం విత్తనాలు పిఎల్ఎ1100 -40 బస్తాలు 1200 కిలోలు, సూపర్ రూ.33,840 విలువ కలిగిన 4.700 టన్నులు, డిఎపి రూ.53,750 విలువ కలిగిన 2.150 టన్నులు మొత్తం రూ.87,590 వ్యత్యాసం గుర్తించి వాటిని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో మండల విద్యాశాఖాధికారి డి.ముత్యాలరావు, పి.సురేష్ ఉన్నారు.

అవయవదానానికి ముందుకురావాలి

ప్రజాశక్తి - భీమడోలు

మరణానంతరం ప్రతిఒక్కరూ అవయవదానానికి ముందుకు రావాలని అమ్మ ఐ ఆర్గాన్ అండ్ బాడీ డొనేషన్ ప్రమోటర్స్ ఆర్గనైజేషన్ సంస్థ జిల్లా సమన్వయకర్త టి.సుమన్బాబు కోరారు. గుండుగొలనులో సంస్థ ద్వారా తమ మరణాంతరం నేత్రాలు దానం చేసేందుకు సంసిద్ధత వెలిబుచ్చుతూ తల్లీకుమార్తె కొప్పిశెట్టి ఆదిలక్ష్మి, కానూరు పార్వతి బుధవారం దరఖాస్తు అందించారు. వీరిలో కొప్పిశెట్టి ఆదిలక్ష్మి వికలాంగురాలు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా సమన్వయకర్త మాట్లాడుతూ, మరణానంతరం నేత్రదానంతో పాటు వివిధ అవయాలు, శరీరాన్ని అందజేసేందుకు సంసిద్ధత వ్యక్తపరిచిన వారి నుంచి ముందస్తుగా తమ సంస్థ దరఖాస్తుల స్వీకరిస్తుందన్నారు. ఐదు రాష్ట్రాల్లో విస్తరించి ఉన్న తమసంస్థ ద్వారా మరణానంతరం 122 మంది అవయవదానం, 1223 మంది నేత్రాలను దానం చేశారన్నారు. ఐదు రాష్ట్రాల నుంచి ఈ తరహాలో లక్ష మంది వరకూ దరఖాస్తు చేసుకున్నారని వివరించారు.

చిన్నారులకు అంగన్వాడీ విద్య అవసరం

ప్రజాశక్తి - ముసునూరు

చిన్నారులకు అంగన్వాడీ విద్య అత్యవసరమని అంగన్వాడీ ఉపాధ్యాయురాలు పి.రాజకుమారి అన్నారు. బుధవారం చింతలవల్లి శివారు గోగులంపాడు అంగన్వాడీ కేంద్రంలో ఆంగన్వాడీ విద్యపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ విద్య ఆటపాటలతో కూడిన విద్య అని అన్నారు.

ఉంగుటూరు: చిన్నార విద్యాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు పునాది అని ఐసిడిఎస్ భీమడోలు సిడిపిఒ కె.విజయలక్ష్మి అన్నారు. జనభాగీదారి కార్యక్రమంలో భాగంగా బుధవారం చేబ్రోలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సెక్టారు సూపర్వైజర్ తెల్ల శారదామణి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. బాదంపూడి , ఉంగుటూరు సెక్టార్లలోనూ అవగాహన ర్యాలీలు నిర్వహించారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి - భీమడోలు



మృతిచెందిన మాణిక్యాలరావు

భీమడోలు జంక్షన్లో బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వీరవాసరం మండలం తోలేరు గ్రామానికి చెందిన దంపనబోయిన మాణిక్యాలరావు ద్విచక్ర వాహనంపై ద్వారకాతిరుమల నుంచి ఇంటికి బయలుదేరాడు. భీమడోలు జంక్షన్ వద్ద స్పీడ్ బ్రేకర్లను గమనించక వేగంగా వాహనం నడపడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతను తీవ్రంగా గాయపడి ఘటనాస్థలిలోనే మృతిచెందారు. భీమడోలు పంచాయతీ కార్యదర్శి వెజ్జు వినయ్కుమార్ పంచనామా నిర్వహించారు. ఎస్ఐ చావా సురేష్ కేసు నమోదు చేశారు.

కోళ్ల వ్యర్థాలు తలిస్తున్న వ్యాన్ సీజ్

ప్రజాశక్తి - ముసునూరు

కోర్లగుంట శివారు నెలపాటివారిగుంట వద్ద పోలీసులు చేపట్టిన వాహన తనిఖీల్లో కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న లారీని సీజ్ చేశారు. ఎస్ఐ ఎం.కుటుంబరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వ్యర్థాలను నూజివీడు వైపు నుండి ఏలూరు వైపు వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా వ్యర్థాలను గుర్తించామన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని చేపల చెరువులకు వీటిని తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాదు నుంటి వీటిని తీసుకొస్తున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

యువకుడికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని అన్నవరంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుక్కులూరు గ్రామానికి చెందిన సురేష్(22) ద్విచక్రవాహనంపై విస్సన్నపేట వైపు తమ బంధువుల ఇంటికి బయలుదేరాడు. అన్నవరం వద్దకు వెళ్లగానే ఓ వాహనం ఇతన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సరేష్ను ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

మామిడి, ఆయిల్పామ్ తోటలు దగ్ధం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లిలో మామిడి, ఆయిల్పామ్ తోటలు బుధవారం అగ్నిప్రమాదంలో చిక్కుకున్నాయి. సమీపంలోని ప్రజలు అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అగ్నిమాపక శాఖ అధికారి మత్తయ్య ఆధ్వర్యంలో మంటలు మరింత వ్యాప్తి చెందకుండా పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.ఐదు లక్షల ఆస్తినష్టం వాటిల్లిందని అంచనా వేశారు. నష్టపరిహారాన్ని అందించాలని రైతులు వేడుకుంటున్నారు.

పెళ్లిచేసుకుంటానని మోసం..

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అంతర్జాలంలో పరిచయమైన యువకుడు యువతికి మాయమాటలు చెప్పి గర్భవతిని చేసిన ఘటన ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని శనివారపుపేటకు చెందిన ఓ యువతి విజయవాడలో నర్సింగ్ కోర్సు పూర్తిచేసింది. చదువుకునే సమయంలో ఇన్స్టాగ్రామ్లో ఖమ్మం జిల్లా రామవరం గ్రామానికి యువకుడు చెందిన చంద్రశేఖర్ ఈ యువతిని పరిచయం చేసుకున్నాడు. అలా నిత్యంచాటింగ్ చేసుకుంటూ ఒకరికొకరు దగ్గరయ్యారు. ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మబలికాడు. అయితే నర్సింగ్ కోర్సు పూర్తి చేసిన యవతి హైదరాబాదులోని ఆసుపత్రిలో ఉద్యోగానికి ఎంపికైంది. ఉద్యోగంలో చేరేందుకు వెళుతున్నాని చంద్రశేఖర్కు చెప్పింది. అయితే వెళ్లే మార్గంలో తన ఇంటి వద్ద ఆగాలని, ఇద్దరం కలిసి హైదరాబాదు వెళదామని నమ్మించాడు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ 13వ తేదీన యువతి రామవరం వెళ్లింది. అక్కడ చంద్రశేఖర్ ఆ యువతిని ఓ ఇంట్లో ఉంచి కొద్ది రోజుల తరువాత వెళదామని ఒప్పించాడు. ఈ క్రమంలో పెళ్లి చేసుకుంటానని నమ్మబలికి పలుమార్లు శారీరకంగా అనుభవించాడు. ఈ క్రమంలో ఆమె గర్భందాల్చింది. విషయం తల్లిదండ్రులకు చెప్పింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - భీమడోలు



భీమడోలులో అవగాహన సదస్సులో మాట్లాడుతున్న శశిధర్

విద్యుత్ సిబ్బంది భద్రతా నియమాలను పాటించాలని ఏలూరు డిఇఇ(ఆపరేషన్) టి శశిధర్ పేర్కొన్నారు. భీమడోలులోని ఓ ప్రయివేటు కల్యాణ మండపంలో భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల పరిధిలోని వివిధ సబ్ స్టేషన్లకు చెందిన అధికారులు, సిబ్బందికి విద్యుత్ భద్రత అంశంపై అవగాహన సదస్సును మంగళవారం రాత్రి నిర్వహించారు. ఇటీవల కాలంలో విద్యుత్ లైన్ల మరమ్మతులు చేసే సమయంలో పలువురు ప్రాణాలు కోల్పోతున్న నేపథ్యంలో ప్రస్తుతం నిర్వహిస్తున్న శిక్షణా తరగతులు సిబ్బంది పనితీరు మెరుగుకు సహకరిస్తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పని సమయంలో సిబ్బంది హెల్మెట్, సేఫ్టీ బెల్ట్ ధారణ, ప్రత్యేక పరికరాల ద్వారా తమ పని చేస్తున్న లైనుకు విద్యుత్ సరఫరా ఏ మేరకు వస్తోంది అనే అంశాలను గుర్తించాలని కోరారు. విద్యుత్ స్తంభాలపై పనిచేసే సమయాల్లో సిబ్బంది ఫోన్ వాడకం ఆపాలని, సెల్ఫీ ఫొటోలు తీసుకోవడం తగదని హితవుపలికారు. ఇటీవల తన పరిశీలనలో విద్యుత్ కనెక్షన్ ఇచ్చే సమయంలో ఎర్తింగ్ లోపాలను గమనించామని, ఒక్కొక్క సమయంలో అవి ప్రమాదకారిగా మారే అవకాశం ఉందని పేర్కొన్నారు. దీని నివారణకు ప్రతి కనెక్షన్కూ రెండు ఎర్తింగులు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవి సైతం ప్రమాదాలకు కారణం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎల్సి తీసుకుని విద్యుత్ లైన్ల మరమ్మతుల సమయంలో సబ్ స్టేషన్లో పనిచేసే సిబ్బంది పాత్ర కీలకంగా మారుతుందన్నారు. వీరు లాగ్బుక్లో నమోదు చేయడంతో పాటు సంబంధిత మరమ్మతు పనుల్లో పాల్గొన్న సిబ్బంది సూచనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో భీమడోలు ట్రాన్స్ కో ఎడిఇ కె.గోపాలకష్ణ, ఎఇ భీమేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.


ఉంగుటూరు : విద్యుత్ శాఖలో పనిచేస్తున్న లైన్మెన్లు, ఇతర ఉద్యోగుల భద్రతపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. నారాయణపురం, గొల్లగూడెం, కుంచనపల్లి సెక్షన్లో పనిచేస్తున్న వారికి తాడేపల్లిగూడెం డివిజనల్ ఇంజినీర్ నరహరశెట్టి వెంకటేశ్వరరావు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో విద్యుత్ మరమ్మతులపై మాక్ డ్రిల్ నిర్వహించారు. సేఫ్టీ పద్ధతులను వివరించారు. మూడు సబ్స్టేషన్ల ఎఇలు పాల్గొన్నారు.

విద్యాకానుక కిట్లు అందజేత

ప్రజాశక్తి - పోలవరం

ప్రగడపల్లి పంచాయతీ గుంజవరం మండల ప్రజా పరిషత్ పాఠశాల విద్యార్థులకు సర్పంచి కలుం బాపిరాజు జగనన్న విద్య కానుక కిట్లను బుధవారం అందజేశారు. పాఠశాలలు పున:ప్రారంభం కావడంతో విద్యార్థులకు అవసరమైన పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫారాలు, బూట్లు, షూలు, సాక్సులు టై, బెల్టు, బ్యాగ్తో కలిపిన కిట్ను అందించారు. ఈ సందర్భంగా సర్పంచి బాపిరాజు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యతో ఏదైనా సాధించవచ్చని, విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మండవల్లి: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుకను ఎంఎల్ఎ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, జెడ్పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, సర్పంచి జాన్సీ, సర్పంచుల సంఘం



పోలవరంలో విద్యాకానుకను అందిస్తున్న సర్పంచి

అధ్యక్షులు బేతపూడి ఏసేపురాజు, నాయకులు చేబోయిన వీర్రాజు, గుడివాడ తంబిస్వామి, ఎంఇఒ నరేష్కుమార్ పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మండలంలోని ఎంఎం.పాలెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సర్పంచి బోయపాటి మాధవి జగనన్న విద్యా కానుక కిట్లను అందజేశారు. ఈ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె విద్యార్థులకు సూచించారు. అలాగే పల్లెర్లమూడి పాఠశాల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లను సర్పంచి పులపాక సౌమ్యరేఖ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేళాంగిణికి ప్రత్యేక బస్సు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు నుండి తెలంగాణలోని వేళాంగిణికి ఈనెల 17వ తేదీన ఉదయం 11 గంటలకు స్పెషల్ బస్సు నడపనున్నట్లు ఆర్టిసి డిపో మేనేజర్ సూర్యపవన్కుమార్ తెలిపారు. ఈ బస్సు 18న వేళాంగిణి, 19న చెన్నై మెరీనా బీచ్ మీదుగా ప్రయాణించి 20వ తేదీన నూజివీడు చేరుకుంటుందని తెలిపారు. టిక్కెట్ ధర ఒక్కరికి రూ.3,600 అని తెలిపారు. ఆర్టిసి అధికారిక వెబ్సైట్లో టిక్కెట్లు బుక్ చేసుకోవచ్చని, లేదా డిపో మేనేజర్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు.

చెరువు అక్రమ తవ్వకం నిలుపుదల

ముదినేపల్లి : ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలను గ్రామస్తుల ఫిర్యాదుతో బుధవారం రెవెన్యూ అధికారులు నిలుపుదల చేశారు. మండలంలోని దేవరం గ్రామ ముఖద్వారం వద్ద అనుమతులు లేకుండా గ్రామానికి చెందిన బడాబాబు సుమారు రెండు ఎకరాల్లో ఆక్వా చెరువు తవ్వకం పనులు చేపట్టాడు. గ్రామస్తులు హెచ్చరించినా ఖాతరు చేయకుండా ట్రాక్టర్లతో భూమిని దున్ని బ్లేడ్ లాగుతున్నాడు. ఈ విషయమై బుధవారం గ్రామస్తులు తహాశీల్దార్ కె.శ్రీనివాస్కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాలతో ఆర్ఐ పి.శివకుమార్ దేవరం వెళ్లి చెరువు తవ్వుతున్న ట్రాక్టర్లను పొలంలో నుంచి బయటకు పంపించి పనులు నిలుపుదల చేయించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా అనుమతులు లేకుండా చెరువులు తవ్వితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పద్మశాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా నాగరాజు

ఏలూరు టౌన్: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పద్మశాలి సంఘం అధ్యక్షులు వానపల్లి నాగరాజును పద్మశాలి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్గా నియమించినట్లు రాష్ట్ర పద్మశాలి సంఘం అధ్యక్షులు జగ్గారపు శీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. నాగరాజు గతంలో పద్మశాలి సాధికారత సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, పద్మశాలి సంఘం మొదటి రాష్ట్ర యువత అధ్యక్షునిగా పనిచేసిన అనుభవం ఉందని తెలిపారు. 13 జిల్లాల్లో ఉమ్మడి పశ్చిమలో కొత్త ఒరడిని సృష్టించి ఎన్నిక పెట్టి గెలిచి అధ్యక్షులు అయినందుకు జిల్లా పద్మశాలీలు గర్విస్తున్నారని తెలిపారు.

టిడిపి మినీమేనిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - చాట్రాయి

టిడిపి అధినేత చంద్రబాబు ప్రకటించిన మినీ మేనిఫెస్టో పేదలకు ఎంతగానో ఆసరాగా నిలుస్తుందని టిడిపి మండల అధ్యక్షులు మరిడి వెంకటేశ్వరరావు అన్నారు. పార్టీ మండల కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ విడుదల చేసిన మినీ మేనిఫెస్టోను ప్రజలకు తీసుకెళ్లాలని కార్యకర్తలకు, నాయకులు సూచించారు. ప్రజలకు వివరించేందుకు 'భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమాన్ని మండలంలోని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 15వ తేదీన ఆరుగులనుపేటలో, 16న సోమవారం గ్రామంలో, 17న కొత్తగూడెంలో నిర్వహిస్తామని వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో దిశా యాప్ రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గొల్లపల్లిలో బుధవారం మహిళా పోలీసులు దిశా యాప్ రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ ఫోన్లు ఉన్న మహిళలందరూ తప్పనిసరిగా దిశా యాప్ను ఇన్స్టాల్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

తాగునీటి చెరువు శుభ్రం

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని లోడిదలంకలో పది ఎకరాల్లోని తాగునీటి చెరువు పసర్లుదేరడంతో, తాగునీటి కోసం కలిదిండి వెళ్లి గొనుగోలు చేసి తాగాల్సిన దుస్థితిపై ప్రజాశక్తిలో ప్రచురించిన కథనానికి పంచాయతీ కార్యదర్శి చిరంజీవి స్పందించారు. చెరువులోని నీరు ఎండ తీవ్రతకు ఆకుపచ్చని రంగులోకి మారాయన్నారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు వాటర్ ప్యూరిఫికేషన్లో భాగంగా ఆలమ్(పట్టిక)ను తాగునీటి చెరువులో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేశామన్నారు. అనంతరం శుద్ధి చేసిన నీటిని గ్రామ ప్రజలకు సరఫరా చేశామన్నారు.

పారిశుధ్య ఎలక్ట్రిక్ ఆటోలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనుల వినియోగానికి ఎలక్ట్రిక్ ఆటోలు అందించిన ఘనత సిఎం జగన్కు దక్కుతుందని ఎంఎల్ఎ ఎలిజా అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపాలిటీ చెత్త సేకరణకు అందించిన తొమ్మిది ఎలక్ట్రికల్ ఆటోలను ఎంఎల్ఎ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వైస్ ఛైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, కౌన్సిలర్లు పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావు, నేకూరి కిషోర్, ఉగ్గం ప్రసాద్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి ఎంపిడిఒగా శంకర్రావు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఎంపిడిఒగా పి.శంకరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. రెడ్డిగూడెం మండల ఇఒపిఆర్డిగా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఆగిరిపల్లి ఎంపిడిఒగా వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టి, సత్వర సేవలు అందిస్తామని తెలిపారు. అనంతరం ఆయన పోతవరప్పాడులోని చెత్త నుండి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, కార్యదర్శి సిహెచ్.పుల్లారావుకు పలుసూచనలు చేశారు.